కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ సోమవారం సమన్లు జారీ చేసింది. నవంబర్ 2న విచారణకు రావాలని కోరింది. ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న ఆప్ నేత మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిన కొద్ది గంటల్లోనే ఈడీ ఈ సమన్లు జారీ చేయడం గమనార్హం. ఈ కేసులో రూ.338 కోట్ల లావాదేవీలకు సంబంధించి తదుపరి నిర్ధారణ జరగాల్సి ఉందన్న కారణంతో సిసోడియాకు బెయిల్ నిరాకరించినట్టు సుప్రీంకోర్టు తెలిపింది.

మహారాష్ట్ర స్పీకర్‌కు 'సుప్రీం' అల్టిమేటం

- అనర్హత పిటిషన్లపై డిసెంబర్ 31లోగా తేల్చాలని ఆదేశం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని శివసేన పార్టీ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై డిసెంబరు 31నాటికి నిర్ణయం తీసుకోవాలని శాసనసభాపతి రాహుల్ నార్వేకర్‌కు సుప్రీంకోర్టు గడువు విధించింది. ఆ పార్టీలోని ఉద్ధవ్ ఠాక్రే, ఏక్‌నాథ్ షిండే వర్గాలు ఎదుటి పక్షం ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఒకరిపై మరొకరు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఎన్సీపీలోని అజిత్ పవార్ వర్గానికి చెందిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై వచ్చే జనవరి 31 నాటికి నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది.

టాటాకు 766 కోట్లు చెల్లించండి

- సింగూరు కేసులో మమత సర్కారుకు ట్రిబ్యునల్ ఆదేశం

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ నిరసనల వల్ల టాటా మోటార్స్‌కు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ సోమవారం తీర్పు చెప్పింది. టాటా మోటార్స్‌కు నష్టపరిహారంగా రూ.765.78 కోట్లు చెల్లించాలని మమత సర్కారును ఆదేశించింది. దీనిపై తృణమూల్ స్పందిస్తూ.. ఈ తీర్పు చిట్ట చివరిది కాదని, న్యాయ పోరాటానికి అవకాశాలు ఇంకా ఉన్నాయని పేర్కొన్నది. నానో కార్ల కంపెనీని బెంగాల్‌లోని సింగూరులో ఏర్పాటు చేయాలని టాటా మోటార్స్ ప్రయత్నించింది. అప్పట్లో సీపీఎం ప్రభుత్వం ఉండేది. టీఎంసీ ఆందోళన నేపథ్యంలో ఈ ప్రాజెక్టు గుజరాత్ తరలిపోయింది.

ఇజ్రాయెల్ తరహాలో ఐరన్‌డోమ్

అభివృద్ధి చేయనున్న డీఆర్‌డీవో

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' తరహాలో త్వరలో మనకూ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ అందుబాటులోకి రానున్నది. శత్రు క్షిపణులను, రాకెట్లను గాల్లోనే తుత్తునియలు చేయగల ఐరన్‌డోమ్ వ్యవస్థను ఇజ్రాయెల్ అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవస్థ కారణంగానే హమాస్ దాడుల నుంచి ఇజ్రాయెల్‌కు తక్కువ ప్రాణనష్టం జరిగింది. ఈ క్రమంలో భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) కూడా సొంతంగా ఐరన్‌డోమ్ తరహా రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రాజెక్టు కుశ పేరుతో దీనిని అభివృద్ధి చేస్తున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. 2028-29 నాటికి ఇది అందుబాటులోకి రానుంది.

81 కోట్ల మంది ఆధార్ డాటా లీక్!

- డార్క్‌వెబ్‌లో అమ్మకానికి పెట్టిన సైబర్ నేరగాళ్లు
- ఇది దేశంలోనే అత్యంత భారీ డాటా చోరీ
- హెచ్చరించినా పట్టించుకోని కేంద్ర సంస్థలు
- ఐసీఎంఆర్ నుంచి చోరీ అయినట్టు అనుమానాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30: ఆధార్‌లో నిక్షిప్తమైన భారతీయుల బయోమెట్రిక్ వివరాలు సురక్షితం కావన్న నిపుణుల ఆందోళన మరోమారు నిజమని నిరూపణ అయింది. తమ వద్ద 81.5 కోట్ల మంది భారతీయుల బయోమెట్రిక్ వివరాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయంటూ డార్క్‌వెబ్‌లో వెలువడిన ఒక ప్రకటన ఒక్కసారిగా ప్రభుత్వ యంత్రాంగాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిని దేశంలోనే అత్యంత భారీ డాటా చోరీగా పేర్కొంటున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) వద్ద ఉన్న భారతీయుల వివరాలు సైబర్ దొంగల చేతికి చిక్కినట్టు తెలుస్తున్నది. ఈ ఘటనపై ఐసీఎంఆర్ నుంచి ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తు చేసేందుకు సీబీఐ సిద్ధంగా ఉన్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. తమ వద్ద 81.5 కోట్ల మంది భారతీయులకు సంబంధించిన ఆధార్, పాస్‌పోర్ట్ సమాచారం ఉన్నట్టు ఓ అజ్ఞాత వ్యక్తి డార్క్‌వెబ్‌లో ప్రకటించాడు. దీనికి సంబంధించి కొన్ని పేర్లు, వారి ఫోన్ నంబర్లు, అడ్రస్‌లతో సహా వెల్లడించాడు. ఈ వివరాలు ఐసీఎంఆర్ వద్దనున్న డాటాతో సరిపోలినట్టు అధికారులు పేర్కొన్నారు. ఐసీఎంఆర్ మీద గత ఫిబ్రవరి నుంచే సైబర్ దాడులు జరుగుతున్నాయి. గత ఎనిమిది నెలల్లో సుమారు ఆరు వేల సార్లు ఐసీఎంఆర్ సర్వర్లపై దాడులు జరిగినట్టు అధికారులు తెలిపారు. దీనిపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కేంద్ర సంస్థలు హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోయిందని, అక్కడి నుంచే డాటా చోరీ జరిగిందని అభిజ్ఞ వర్గాలు పేర్కొన్నాయి. డాటా చోరీ విషయం తెలిసిన వెంటనే వివిధ ప్రభుత్వ సంస్థలు, మంత్రిత్వశాఖలకు చెందిన ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. డాటా చోరీలో విదేశీ వ్యక్తుల హస్తమున్నట్టు అనుమానిస్తున్నారు. ప్రస్తుతానికి మరింత నష్టం జరుగకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్తున్నారు.

కొవిడ్ పరీక్షలతో ఐసీఎంఆర్‌కు చేరిన డాటా

కొవిడ్ పరీక్షలు జరిపిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆయా వైద్య సంస్థలు సేకరించిన పౌరుల వివరాలు ఐసీఎంఆర్‌కు, జాతీయ సమాచార కేంద్రానికి (ఎన్ఐసీ), కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు అందించారు. ఈ మూడు ప్రదేశాలలో ఎక్కడి నుంచి డాటా చోరీ అయిందో తెలియాల్సి ఉన్నదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. భారతీయుల డాటా చోరీ విషయాన్ని ముందుగా అమెరికాకు చెందిన సైబర్ సెక్యూరిటీ, నిఘా విభాగమైన 'రీసెక్యూరిటీ' సంస్థ బయటపెట్టింది. ఈ నెల 9న 'పీడబ్ల్యూన్0001' పేరిట ఓ అజ్ఞాత వ్యక్తి 81.5 కోట్ల మంది భారత పౌరుల ఆధార్, పాస్‌పోర్ట్ రికార్డులను 'బ్రీచ్ ఫోరమ్స్'పై పోస్ట్ చేసినట్టు రీసెక్యూరిటీ సంస్థ వెల్లడించింది. తమ వద్దనున్న డాటాకు రుజువుగా నాలుగు శాంపిల్స్‌ను కూడా సదరు అజ్ఞాత వ్యక్తి బయటపెట్టగా.. ఒక్కో శాంపిల్‌లో లక్ష మందికి సంబంధించిన 'గుర్తించదగిన వ్యక్తిగత సమాచారం (పీఐఐ)' ఉన్నట్టు చెప్తున్నారు. భారత ఆరోగ్య వ్యవస్థపై హ్యాకర్లు దాడులు చేయటం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది ఢిల్లీలోని ఎయిమ్స్‌పై సైబర్ దాడులు జరిగాయి. సర్వర్లన్నింటినీ తమ స్వాధీనంలోకి తెచ్చుకున్న హ్యాకర్లు ఔట్‌పేషెంట్ విభాగంలోని రోగుల రికార్డులన్నీ ప్రభావితం చేశారు.

ఏం జరుగొచ్చు?

ఆధార్ వివరాలు అంత సురక్షితంగా లేవని, ఆ సమాచారాన్ని ఎవరైనా దొంగిలించవచ్చని బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్, క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ గత నెలలోనే హెచ్చరించాయి. అయితే హెచ్చరికలను కేంద్ర సంస్థలు వెంటనే తోసిపుచ్చాయి. దేశంలో బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి వ్యక్తి ఆధార్‌ను దానికి అనుసంధానం చేశారు. పట్టణాలు, నగరాల్లోనే కాదు గ్రామీణులు సైతం ఎలక్ట్రానిక్స్ విధానంలో ఆర్థిక లావాదేవీలు జరుపుతున్నారు. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఓటర్ల వివరాలకు ఆధార్‌ను అనుసంధానం చేసింది. ఇప్పటికి 94.5 కోట్ల మంది అనగా 60 శాతం మంది ఓటర్లు తమ ఓటర్ ఐడీతో ఆధార్‌ను అనుసంధానం చేశారు. సైబర్ దొంగల వద్దనున్న భారతీయుల డాటాతో ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్ దోపిడీలు, ట్యాక్స్ రిఫండ్ మోసాలు, ఇతర ఆర్థిక నేరాలకు పాల్పడే అవకాశమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రైతుల మధ్య లేకుంటే టికాయిత్ హతం

- ఎన్‌కౌంటర్‌లో ఖతమయ్యేవాడు
- యూపీ బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు

నంద కిషోర్

భగ్‌పట్, అక్టోబర్ 30: రైతు నేత రాకేశ్ టికాయిత్‌పై ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే నంద కిషోర్ గుర్జర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాల విషయంలో టికాయిత్ రైతులను మోసం చేశాడని, ఆయన రైతుల మధ్య లేకుంటే ఇప్పటికే ఎన్‌కౌంటర్‌లో హతమై ఉండేవాడని వ్యాఖ్యానించారు. భాగ్‌పట్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న నంద కిషోర్ అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతుల ఆందోళనల సమయంలో టికాయిత్ చుట్టూ రైతులు లేకుంటే, ఆయన్ను ఎన్‌కౌంటర్‌లో చంపేసేవారని అన్నారు. నూతన వ్యవసాయ చట్టాలు అమల్లోకి వచ్చి ఉంటే రైతులకు మధ్యవర్తులు, దళారుల బారి నుంచి విముక్తి లభించేదని, కేంద్రంలోని తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆ చట్టాలతో రైతుల జీవితాలు మారిపోయేవని చెప్పుకొచ్చారు. ఖలిస్థానీలు, మధ్యవర్తులతో టికాయిత్ కుమ్మక్కయ్యారని, హేయమైన నేరాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. రెండేండ్ల తర్వాత రైతులు ఆయన్ను దేశంలోకి అడుగు కూడా పెట్టనివ్వరని అన్నారు. మన దేశాన్ని మొఘలులు, ఆ తర్వాత బ్రిటీష్ వాళ్లు బానిసగా చేసుకొన్నారని, త్రివర్ణ జెండా స్థానంలో ఖలిస్థాన్ జెండాను ఎగురవేయడం ద్వారా టికాయిత్ కూడా అదే పనిచేశాడంటూ నంద కిషోర్ గుర్జర్ ఆరోపణలు చేశాడు.

ఆ స్టేట్‌మెంట్‌కు కారణాలేంటి?

ఎమ్మెల్యే నంద కిషోర్ వ్యాఖ్యలపై టికాయిత్ తీవ్రస్థాయిలో స్పందించారు. తాను ఎక్కడ ఖలిస్థాన్ జెండాను ఎగురవేశానో ఆయన చూపించాలని డిమాండ్ చేశారు. ప్రధాని కూడా గురుద్వారాను సందర్శించారన్నారు. గుర్జర్ ఎన్‌కౌంటర్ వ్యాఖ్యలపై కేంద్రం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాంటి ప్రకటన చేయడానికి గల కారణాలను తెలుసుకొనేందుకు ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. రైతుల ఆందోళనల సమయంలో నంద కిషోర్ గుర్జర్ గందరగోళం సృష్టించారని, ఆయన అనుచరులు పోలీసుల సమక్షంలోనే రైతులపై దాడి చేశారన్న ఆరోపణలు న్నాయి.

దవాఖానలో బెడ్స్ ఖాళీ లేక బీజేపీ మాజీ ఎంపీ కొడుకు మృతి

- యూపీలో ఇక సామాన్యుల పరిస్థితేమిటని అఖిలేశ్ ప్రశ్న

డబుల్ ట్రబుల్ ఇంజిన్

న్యూఢిల్లీ: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో ఎమర్జెన్సీ బెడ్ ఖాళీ లేక బీజేపీ మాజీ ఎంపీ కుమారుడు దవాఖానకు వచ్చిన గంటసేపటికే మరణించాడు. లక్నోలోని సంజయ్‌గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. బండా నియోజకవర్గ మాజీ బీజేపీ ఎంపీ భైరాన్ ప్రసాద్ మిశ్రా తన కొడుకు ప్రసాద్ మిశ్రాను గత శనివారం రాత్రి దవాఖానకు తీసుకొచ్చారు. అయితే ఎమర్జెన్సీ బెడ్స్ ఖాళీ లేవని డ్యూటీ అధికారి చెప్పారు. ఆ తర్వాత గంటసేపటికే ప్రకాశ్ మిశ్రా మరణించారు. దీనిపై ఆగ్రహించిన ప్రసాద్ మిశ్రా రాత్రంతా దవాఖానలో ధర్నా చేశారు. ప్రసాద్ మిశ్రా మరణంపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఎక్స్‌లో ట్వీట్ చేస్తూ.. 'యూపీలో అధికార బీజేపీ మాజీ ఎంపీ కొడుక్కే చికిత్స లభించకపోతే.. సామాన్యుల పరిస్థితి ఏమిటి? ఇతర రాష్ర్టాల్లో ఎన్నికల ప్రచారం చేసొచ్చిన తర్వాత మంత్రి దీనిపై స్పందిస్తారని అనుకుంటున్నా. ఎందుకంటే ఇప్పుడు వారికి ఎవరి ప్రాణాల కన్నా ఎన్నికలే ముఖ్యం' అని విమర్శించారు.

ప్రజలకు ఆ హక్కు లేదు

- రాజకీయ పార్టీల విరాళాల వివరాలు తెలుసుకొనే అవకాశం ఓటర్లకు లేదు
- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం
- ఎలక్టోరల్ బాండ్ స్కీమ్ పారదర్శకమైనదని వెల్లడి
- స్కీమ్ చెల్లుబాటుపై నేడు విచారణ

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు విరాళాలు ఎక్కడి నుంచి వచ్చాయో తెలుసుకొనే హక్కు ఓటర్లకు లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్(ఏజీ) ఆర్ వెంకటరమణి ఆదివారం సుప్రీంకోర్టుకు రాతపూర్వకంగా అభిప్రాయాన్ని వెల్లడించారు. ఎలక్టోరల్ బాండ్ స్కీమ్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం మంగళవారం నుంచి విచారణ చేపట్టనున్న నేపథ్యంలో ఏజీ న్యాయస్థానానికి స్టేట్‌మెంట్ సమర్పించారు. ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం.. ఎన్నికల్లో సరైన అభ్యర్థిని ఎన్నుకొనేందుకు.. పోటీచేస్తున్న అభ్యర్థుల పూర్వాపరాలు తెలుసుకొనేందుకు ప్రజలకు హక్కు ఉందని, అంతేగానీ ప్రతి ఒక్క విషయాన్ని తెలుసుకొనే ప్రాథమిక హక్కు లేదని పేర్కొన్నారు.

చట్టం లేదు.. నిర్ణయాలు వద్దు

స్పష్టమైన రాజ్యాంగపరమైన చట్టం లేనందున, ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ విషయంలో నిర్ణయాలు తీసుకోవద్దని ఏజీ న్యాయస్థానాన్ని కోరారు. రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ పారదర్శకమైనదని తెలిపారు. విరాళ దాతల వివరాలను గోప్యంగా ఉంచడానికి ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నది. పన్ను బాధ్యతలకు కట్టుబడి ఉండేలా చేస్తుందని వివరించారు.

గతంలో తిరస్కరించిన సుప్రీం

కేంద్ర ప్రభుత్వం 2018 జనవరి 2న ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని నోటిఫై చేసింది. దేశానికి చెందిన ఓ వ్యక్తి లేదా కొందరు వ్యక్తులు లేదా సంస్థలు రాజకీయ పార్టీలకు విరాళాలను నగదు రూపంలో ఇవ్వడానికి బదులుగా ఈ బాండ్ల రూపంలో ఇవ్వవచ్చు. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తాత్కాలికంగా నిలిపేస్తూ ఆదేశాలు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు 2020 జనవరి 20న తిరస్కరించింది. 2019 ఏప్రిల్‌లో కూడా ఈ పథకాన్ని నిలిపేసేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది.

మహారాష్ట్ర తరహాలోనే కర్ణాటక సర్కార్ కూలుతుంది

- బీజేపీ ఎమ్మెల్యే రమేశ్ జార్ఖిహోళి సంచలన వ్యాఖ్య
- 2019లో ఆపరేషన్ కమల్ నిజమేనని వెల్లడి
- శివకుమార్‌పై తీవ్ర ఆరోపణలు

రమేశ్ జార్ఖిహోళి

బెళగావి, అక్టోబర్ 30: మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వం పడిపోయినట్టే కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కూలిపోతుందని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే రమేశ్ జార్ఖిహోళి వ్యాఖ్యానించారు. బెళగావిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్ త్వరలో అధికారం కోల్పోతారని అన్నారు. ఒక రాత్రిలో ఏదైనా మారిపోతుందని, హైకోర్టులో తగిలే ఎదురు దెబ్బలతో శివకుమార్ మాజీ మంత్రి అయిపోతాడంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆపరేషన్ కమలం సాధ్యం కాదంటూనే.. మహారాష్ట్రలో జరిగినట్లుగా జరిగితే, కర్ణాటకలో కూడా ప్రభుత్వం పడిపోతుందని, శివకుమార్ వల్లనే అది జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాళ్లు పట్టుకొని, అధికారంలో ఉన్నప్పుడు జుట్టు పట్టుకొనే వ్యవహారశైలి డీకే శివకుమార్‌ది అని విమర్శించారు.

గతంలో కర్ణాటకలో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చడంలో కీలక పాత్ర పోషించిన బీజేపీ ప్రముఖ నేతల్లో రమేశ్ జార్ఖిహోళి కూడా ఒకరనే ఆరోపణలు ఉన్నాయి. శివకుమార్ పెద్ద మనిషేం కాదని, సీడీల పేరుతో ప్రతి ఒక్కరినీ బ్లాక్‌మెయిల్ చేస్తుంటాడని ఆరోపించారు. డీకే పెద్ద మోసగాడని, ఆయనకు పోరాడే శక్తి లేదని అన్నారు. 20 రోజుల క్రితం సీడీతో ఒక ఎమ్మెల్యేను బ్లాక్‌మెయిల్ చేశాడని పేర్కొన్నారు. 2019లో ఆపరేషన్ కమలం చేపట్టినట్టు అంగీకరించిన రమేశ్ జార్ఖిహోళి.. కొన్ని అనివార్య పరిస్థితుల్లో అది జరిగిందని, డీకే శివకుమార్ నియంతృత్వం, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య వంటి వారి వల్ల చోటుచేసుకొన్నదని చెప్పుకొచ్చారు.

లైంగిక వేధింపులు విదేశాల్లో జరిగితే

మీరెలా విచారిస్తారు?

న్యూఢిల్లీ: మహిళా రెజ్లర్లు తనపై చేస్తున్న లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఢిల్లీ కోర్టుకు ఉన్న అధికార పరిధిని ఈ కేసులో నిందితుడిగా ఉన్న బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ సోమవారం ప్రశ్నించారు. రెజ్లర్లు తనపై పెట్టిన కేసులో ఆరోపిస్తున్న ఘటనలు లేదా పరిణామాలు భారత్‌లో జరుగలేదని పేర్కొన్నారు. ఈ మేరకు బ్రిజ్ భూషణ్ తరఫు న్యాయవాది రాజీవ్‌మోహన్ కోర్టు ముందు వాదనలు వినిపించారు. రెజ్లర్లను బ్రిజ్ భూషణ్ టోక్యో, మంగోలియా, బల్గేరియా, జకార్తా, కజకిస్థాన్, టర్కీలో లైంగికంగా వేధించాడని ప్రాసిక్యూషన్ ఆరోపిస్తున్నదని, వీటిపై విచారణ జరిపే అధికార పరిధి ఈ కోర్టుకు లేదన్నారు. బ్రిజ్‌భూషణ్ న్యాయవాది వాదనలకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీవాస్తవ కౌంటర్ ఇచ్చారు. రెజ్లర్లపై అవకాశం చిక్కినప్పుడల్లా నిందితుడు అసభ్యంగా ప్రవర్తించాడని, ఈ వేధింపులను మొత్తంగా ఒకటిగా చూడాల్సిన అవసరం ఉన్నదన్నారు. కేసును మెజిస్ట్రేట్ నవంబర్ 22కు వాయిదా వేశారు.

ఎన్సీపీ ఎమ్మెల్యేల ఇంటికి నిప్పు

- మరాఠా కోటా ఉద్యమం హింసాత్మకం
- బీజేపీ ఎమ్మెల్యే ఆఫీస్ ధ్వంసం
- బీడ్‌లో కర్ఫ్యూ విధింపు

మంటల్లో తగలబడుతున్న ఎన్సీపీ ఎమ్మెల్యే ప్రకాశ్ సోలంకి ఇల్లు

ఛత్రపతి శంభాజీనగర్/ముంబై, అక్టోబర్ 30: మరాఠా కోటా ఉద్యమం హింసాత్మకంగా మారింది. కొందరు ఆందోళనకారులు సోమవారం ఇద్దరు ఎన్సీపీ ఎమ్మెల్యేల ఇంటికి నిప్పుపెట్టారు. దీంతో బీడ్ జిల్లా అంతటా కర్ఫ్యూ విధిస్తున్నట్టు పోలీస్ అధికారులు ప్రకటించారు. కోటా అమలు కోసం ప్రభుత్వానికి డెడ్‌లైన్ పెట్టడాన్ని చిన్నపిల్లల ఆటగా ఎన్సీపీ ఎమ్మెల్యే ప్రకాశ్ సోలంకి అభివర్ణించడంతో మహారాష్ట్రలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీడ్ జిల్లాలోని ప్రకాశ్ సోలంకి ఇంటికి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. అనంతరం రాళ్లు విసిరారు. అక్కడే ఉన్న ఓ కారుకు కూడా నిప్పంటించారు. బీడ్‌లోని మరో ఎన్సీపీ ఎమ్మెల్యే సందీప్ క్షీరసాగర్ నివాసంపైనా ఆందోళనకారులు దాడికి తెగబడ్డారు. ఆయన ఇంటికి, సమీపంలో ఉన్న వాహనాలకు నిప్పు పెట్టారు. అలాగే ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలోని బీజేపీ ఎమ్మెల్యే ప్రశాంత్ బాంబ్ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. బీడ్ జిల్లాలోని మజల్‌గావ్ మున్సిపల్ కౌన్సిల్ భవనం మొదటి అంతస్తుకు కూడా నిప్పుపెట్టారు. అలాగే ఆదివారం నుంచి సోమవారం నాటికి దాదాపు 13 ఆర్టీసీ బస్సులపై దాడి చేశారు. అద్దాలను పగులగొట్టారు. దీంతో 30 డిపోలలో సేవలను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు.

ఇద్దరు షిండే వర్గ ఎంపీలు రాజీనామా!

మరాఠాలకు రిజర్వేషన్లపై మాటమార్చిన బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఇద్దరు శివసేన (షిండే వర్గం) ఎంపీలు సోమవారం తమ పదవులకు రాజీనామా చేశారు. మరాఠా కోటా అమలు జేయాలని డిమాండ్ చేస్తూ హింగోలి ఎంపీ హేమంత్ పాటిల్ తన రాజీనామా పత్రాన్ని న్యూఢిల్లీలో లోక్‌సభ సెక్రెటరీకి సమర్పించగా, నాసిక్ ఎంపీ హేమంత్ గాడ్సే తన రాజీనామా లేఖను సీఎం షిండేకు పంపారు. షిండే వర్గ ఎంపీల రాజీనామా అంతా పొలిటికల్ స్టంట్‌గా ఎన్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే కొట్టిపారేశారు.

సుప్రీంలో క్యూరేటివ్ పిటిషన్: షిండే

మరాఠా ఉద్యమ నేత మనోజ్ జరాంగే నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నది. వైద్య పరీక్షలకు ఆయన నిరాకరిస్తున్నారు. మరోవైపు కోటా విషయంలో సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్ దాఖలుకు సలహా ఇవ్వడానికి ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే తెలిపారు.

భూతల దాడులు తీవ్రం

- ఉత్తర, మధ్య గాజాపై దాడులు పెంచిన ఇజ్రాయెల్ సైన్యం
- 24 గంటల్లో 600 స్థావరాలపై దాడి

ఖాన్ యూనిస్(గాజా స్ట్రిప్), అక్టోబర్ 30: గాజాపై భూతల దాడులను ఇజ్రాయెల్ తీవ్రతరం చేసింది. గత 24 గంటల్లో 600 స్థావరాలపై విరుచుకుపడింది. ఇందులో పదుల సంఖ్యలో హమాస్ మిలిటెంట్లను మట్టుబెట్టినట్టు సైన్యం ప్రకటించింది. వేలాది మంది పాలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్న దవాఖానల సమీపంలో వైమానిక దాడులు జరుగుతుండటంపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది.

పిల్లలకు ఉప్పునీళ్లు..

యుద్ధం కారణంగా గాజాలో నిత్యావసరాల కొరత తీవ్రమైంది. ఆహార లభ్యత కష్టం కావడంతో ప్రజలు తమ పిల్లలకు బలవంతంగా ఉప్పు నీళ్లు తాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని యునిసెఫ్ ప్రతినిధి టోబీ ఫ్రికర్ ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మానవతా దృక్పథంతో ఇరు పక్షాలు తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు.

రష్యాలో ఇజ్రాయెల్ ప్రయాణికులపై దాడి

ఆదివారం రష్యాలోని మకాచకలా విమానాశ్రయంలోకి దూసుకొచ్చిన కొందరు.. ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ నుంచి వచ్చిన విమానంలో ఇజ్రాయెల్ ప్రయాణికుల కోసం గాలించారు. వారిలో కొందరు పాలస్తీనా జెండాలు పట్టుకొని ఉండగా.. కొందరు 'పిల్లల హంతకులకు డంగెస్తాన్‌లో స్వాగతం లేదు' అనే బ్యానర్లను ప్రదర్శించారు. ఇజ్రాయెల్ ప్రయాణికులపై వారు దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 20కి మందికిపైగా గాయపడ్డారు.

16కు చేరిన రైలు ప్రమాద మృతులు

- ఇద్దరు లోకో పైలట్లు, గార్డు మృతి
- ముమ్మరంగా పునరుద్ధరణ చర్యలు

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 16కి పెరిగింది. మరో 100 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు లోకో పైలట్లు, గార్డు మృతి చెందారు. ఇప్పటి వరకు 13 మృతదేహాలను సహాయ బృందాలు వెలికితీశాయి. ఘటనా స్థలంలో పునరుద్ధరణ చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గురైన బోగీలను ట్రాక్‌పై నుంచి తొలగించి అక్కడి నుంచి తరలించారు. ప్రమాద ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాద స్థలిని సందర్శించిన ఏపీ సీఎం జగన్ అనంతరం దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. రైలు ప్రమాదం కారణంగా 33 రైళ్లను రద్దు చేయగా, మరో 6 రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు తెలిపారు. 24 రైళ్లను దారి మళ్లించామని, 11 రైళ్లను పాక్షికంగా రద్దు చేశామని చెప్పారు.

రైలు ప్రమాద స్థలంలో కొనసాగుతున్న సహాయ చర్యలు

కేంద్రం వైఫల్యం: తోట చంద్రశేఖర్

విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదం జరగటం దురదృష్టకరమని బీఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. మృతి చెందిన ప్రయాణికుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రైలు ప్రమాదాలను నివారించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు.

కొవిడ్ రోగులు ఎక్కువగా శ్రమించొద్దు

గుండెపోటు మరణాల నేపథ్యంలో కేంద్ర మంత్రి మాండవీయ సూచన

న్యూఢిల్లీ, అక్టోబర్ 30: దేశంలో రోజురోజుకీ గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ముఖ్యంగా టీనేజ్ కుర్రాళ్లు హఠాత్తుగా చనిపోతున్న ఘటనలు చూస్తున్నాం. దీనికి సంబంధించి కేంద్ర ఆరోగ్యమంత్రి మన్సుఖ్ మాండవీయ తాజాగా ఓ కీలక ప్రకటన చేశారు. కొవిడ్ పేషెంట్స్ అధిక పని ఒత్తిడికి దూరంగా ఉండాలని, తీవ్రమైన శ్రమతో కూడిన వ్యాయామాలు చేయవద్దని సూచించారు. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తాజా అధ్యయనాన్ని ఉటంకిస్తూ కొవిడ్ బాధితులకు ఈ సూచన చేశారు. 'తీవ్రమైన కొవిడ్-19 ఇన్‌ఫెక్షన్‌తో బాధపడ్డవారు.. ఒకటి లేదా రెండేండ్ల వరకు జాగ్రత్తగా ఉండాలి. అధిక శ్రమతో కూడిన తమ పనుల్ని వాయిదా వేసుకుంటే మంచిది' అని చెప్పారు. కొద్ది రోజుల క్రితం గుజరాత్‌లో దసరా పండుగ సమయంలో గార్బా నృత్యం చేస్తూ 10 మందికిపైగా గుండె పోటుతో చనిపోయిన సంగతి తెలిసిందే.



కొవిడ్ టీకాతో ఆకస్మిక మరణాలు పెరగలేదు

న్యూఢిల్లీ: కొవిడ్ వ్యాక్సినేషన్ దేశంలో యువత ఆకస్మికంగా మరణించే ముప్పును పెంచలేదని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తాజా అధ్యయనం వెల్లడించింది. గతంలో కొవిడ్ కారణంగా దవాఖానలో చికిత్స పొందడం, అతిగా మద్యపానం, స్వల్ప సమయంలో తీవ్రంగా శారీరక శ్రమ వంటి ఆకస్మిక మరణ ముప్పును పెంచాయని పేర్కొన్నది. 18-45 సంవత్సరాల మధ్య వయస్కులపై ఈ అధ్యయనాన్ని నిర్వహించారు.